క్లుప్తంగా

పశువులకు టీకాలు తప్పనిసరి



వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని పశు వైద్యధికారి డాక్టర్ అజింక్యా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని హద్నూర్, ముర్తుజాపూర్ గ్రామాల్లో వైద్య శనివారం శిబిరాలు నిర్వహించారు. గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు ముందు జాగ్రతగా ఆవులు, దూడలు, గేదెలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఏఈ తదితరులు

నారాయణఖేడ్: మండలంలోని చల్లగిద్ద తండాలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ఏఈ రాకేశ్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్ నాయక్ శనివారం పరిశీలించారు. పనుల నాణ్యతపై సంతృప్తిని వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులను పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మొగులప్ప

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు 'ధన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ లిటరసి కో–ఆర్డినేటర్ ఎస్.మొగులప్ప బ్యాంకుల్లో పొదుపు చేసుకునే విధానాన్ని వివరించారు. వృథా ఖర్చులు తగ్గించుకుని కలిగే ప్రయోజనాలు, సైబర్ క్రైమ్ గురించి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి దీపిక, ఉపాధ్యాయులు, ధన్ ఫౌండేషన్ సీఎల్ఎఫ్ రాయికోడ్ బ్లాక్ అసోసియేట్ యాదమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మండలం సత్తెగామ, జూకల్ గ్రామాలకు చెందిన దాదాపు 80 కుటుంబాలకు చెందిన వారు శనివారం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సత్తెగామ మాజీ వార్డు సభ్యుడు గైని కిష్టయ్య, నాయకులు నర్సింహులు, సంగమేశ్, సాయిలు, సునీల్, శ్రీకాంత్, రత్నయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు. జూకల్ గ్రామానికి చెందిన 7వ వార్డు సభ్యులు దేవులానాయక్, ప్రకాశ్‌రావు, ఆటో రాజు, కమ్మరి అనిల్, కమ్మరి నవీన్, డీలర్ బాలయ్య కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పీఏసీఎస్ చైర్మన్ శోభ అశోక్ రెడ్డి, వినయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, యాదవరావు, రాములు, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోషణ్ పక్వాడ్



సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నారాయణఖేడ్: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రాజెక్టుస్థాయి పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. సీడీపీఓ సుజాత పంచసూత్రాలను వివరించి అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గంపలే టెంట్‌లు



హాజరు కోసం తలపై గంపలు పెట్టుకొని కూర్చున్న ఉపాధి కూలీలు

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి కూలీలకు గంపలే నీడనిచ్చే టెంట్‌లుగా మారాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి వారికి అవే దిక్కవుతున్నాయి. రోజురోజుకూ ఎండ ఉధృతమౌతోంది. ఈ క్రమంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న స్థలంలోనే కూలీల కోసం టెంట్ ఏర్పాటు చేయాలని గతంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం టెంట్‌లు పంపిణీ చేసింది. నీడ కోసం టెంట్‌లు, అలాగే తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించేవారు. కాని అవన్నీ ఇప్పుడు కరువయ్యాయి.

ఆ నిబంధన ఇప్పుడు లేదు..

కంగ్టి మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 3,640 మంది కూలీలు ఉపాధి పనులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. తాగునీటి విషయంలో వివరణ కోరగా వచ్చే నెల మొదటి వారం నుంచి సంబంధిత పంచాయతీ కార్యదర్శులు తాగునీటి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. టెంట్‌కు సంబంధించి ఎలాంటి ప్రొవిజన్ లేదని పేర్కొన్నారు.

వచ్చేనెల నుంచి..

పని కల్పనలో భాగంగా గులకరాళ్ల కట్టలువేసే పనులు మాత్రమే చేస్తున్నట్లు తెలిపారు. కంగ్టి పెద్ద చెరువులో మాత్రమే కట్ట నుంచి లోపలికి జారిన రాళ్లు, పూడిక తీత పనులు నిర్వహించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. వచ్చే నెల ప్రారంభం నుంచి తప్పని సరిగా 4గంటల పాటు పనిచేస్తేనే కూలీ డబ్బులు జమ అయ్యేట్లు ఫొటో క్యాప్చరింగ్‌తో పాటు అప్‌లోడ్ చేసి కూలీ చెల్లించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు

సంగారెడ్డి అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సంగారెడ్డిశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ తార డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలపై ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు మాట్లాడుతూ పలుమార్లు సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చినా ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడంపై శనివారం ఈ ధర్నా నిర్వహించామన్నారు. కళాశాలలో బీబీఏ గ్రూప్ విద్యార్థులకు వెంటనే తరగతి గది ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులకు మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే లెక్చరర్లు, విద్యార్థులను హెచ్ఓడీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయనను వెంటనే విధుల నుంచి తొలగించాలని నినదించారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఏబీవీపీ ఉద్యమం ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు భాను, కార్యదర్శి మహేశ్, అనూష, నిఖిల్, దినేష్, చింటు, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మరో 'కోవాలెంట్' కార్మికుడు మృతి

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని గుండ్ల మాచునూరు గ్రామ శివారులోని కోవాలెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మరో కార్మికుడు మృతి చెందాడు. ఇప్పటికే కెమిస్ట్‌తో సహా బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారిలో నాలుగో వ్యక్తి స్వాధిన్ రాజ్మాల్ అనే కార్మికుడు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్ఐ సుభాస్ శనివారం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేశ్ తెలిపారు. మొగుడంపల్లి మండలం గుడ్‌పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సుందర్ ఈ నెల 16న గౌసాబాద్ సమీపంలో గల రోడ్డు మూలమలుపు వద్ద తన త్రీవీలర్ ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో గ్రామస్తులు ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి

ఏఐఎస్ఎఫ్ నేతల డిమాండ్

నారాయణఖేడ్: అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని నిర్వహించారు. శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటికుమార్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పవన్, రమేశ్, బన్నీ, ప్రదీప్, మశ్చందర్, అశోక్, ఇసాక్, పండు, అరవింద్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లిలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎర్రొళ్ల మహేశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శిరీష, ప్రశాంత్, సందీప్, రాజ్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వట్‌పల్లి(అందోల్): భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ చెప్పారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. పాత మార్కెట్‌లోని మీట్ మార్కెట్ వద్ద మురుగునీరు రోడ్లపై నిలిచిపోయిందని స్థానికులు చెప్పడంతో జీహెచ్ఎంసీ కార్మికులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం సాయిరాం నగర్ కాలనీ, చైతన్ నగర్ కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు.



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

ఆదమరిస్తే షాకే..

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలు, మూగజీవాలకు ప్రాణసంకటగా మారింది. నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశంలో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, దాని చుట్టూ ఫెన్సింగ్ మరిచిపోయారు. దీంతో తరచూ అక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో జంతువులు మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్ట్ చేసేందుకు స్వయంగా గ్రామస్తులే కొంత డబ్బులను జమ చేయగా, వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు కాజేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని, లేదా వేరే చోటికి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

26న దివ్యాంగుల బస్‌పాస్ మేళా

నారాయణఖేడ్: మంగల్‌పేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 26న దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. దివ్యాంగులు సదరం ధ్రువపత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, ఒకఫోటోతో వచ్చి రూ.50 రుసుము చెల్లించి పాసులు పొందాలన్నారు. రాలేని వారు ఎవరితోనైనా పంపించి పాసులు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివరాలకు 94410 71134 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కమ్యూనికేషన్‌పై పట్టు సాధిస్తే అవకాశాలు

ఐసీఏ రీజినల్ మేనేజర్ మనోజ్ కుమార్

పటాన్‌చెరు: కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలకు కొదవలేదని ఐసీఏ(ఇండియన్ కామర్స్ అకాడమీ) సౌత్ ఇండియా రీజినల్ మేనేజర్ మనోజ్ కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ, ఐటీ, ట్యాలీపై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలకు కొదువలేదన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అల్లం రెడ్డి, కామర్స్ విభాగాధిపతి రాజిరెడ్డి, నరేందర్, రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోజ్ కుమార్

హరీశ్‌రావును కలిసిన బొల్లారం నేతలు



హరీశ్‌రావును కలిసిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన చర్చించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని హరీశ్‌రావు సూచించినట్లు బాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జితో ట్రాఫిక్ కష్టాలు

- ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలు
- సిగ్నల్ ఏర్పాటు చేసినా తప్పని తిప్పలు
- వెడల్పు చేయాలంటున్న వాహనదారులు



తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్

రామచంద్రాపురం (పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న అండర్ బ్రిడ్జి కారణంగా ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. గతంలో ప్రజా ప్రతినిధులు ఈ రైల్వే అండర్ బ్రిడ్జిను వెడల్పు చేస్తామని హామీలు ఇచ్చారు. కానీ అది నేటికీ అమలు కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక నూతన కాలనీలు వచ్చాయి. దీంతో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు జోరు పెరిగింది. ఉదయం సాయంత్రం సమయాల్లో అనేక స్కూల్ బస్సులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. అనేక మంది ఐటీ ఉద్యోగులకు ఇదే ప్రధానమైన దారి. పెరిగిన వాహనాల రద్దీకు తగ్గట్టుగా అండర్ బ్రిడ్జి లేకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

సిగ్నల్స్ ఉన్నా.. ఫలితం సున్నా..

సమస్యను గతంలో స్థానికులు ఉన్నతాధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో అప్పటి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారు. అప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించి వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారు. బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ట్రాఫిక్ సమస్య తీరలేదు. దీనికి తోడు తెల్లాపూర్ వరకు ఎంఎంటీఎస్ రైలు రావడంతో స్థానికులు రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దానివల్ల రింగ్ రోడ్, పటాన్ చెరు వైపు వెళ్లడానికి సులభంగా ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు

నిత్యం విద్యార్థులు, ఉద్యోగస్తులు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జ్‌ను వెడల్పుచేస్తే స్థానికులకు రాకపోకలకు సులువుగా ఉంటుంది. –రాజేష్‌వారి, ఐటీ ఉద్యోగి

రూ.5 కోట్లతో ప్రతిపాదన

విద్యుత్ నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వెడల్పు చేసేందుకు అధికారులు సూచనలిచ్చారు. టీయుఎఫ్ఐడీయూసీ కింద రూ.5కోట్ల నిధులతో మున్సిపల్ అధికారులకు నెల రోజుల క్రితం జిల్లా ఉన్నతాధికారులు ప్రతిపాదనలను పంపించారు.

సంక్షిప్త వార్తలు

◆ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్, కంబాలపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామునే మంగళ వాయిద్యాల నడుమ ఆలయాల తలుపులు తెరిచి స్వామివారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

◆ టీబీపై అవగాహన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెల్లి గ్రామంలో శనివారం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యుడు నర్సింహులు రోగులకు బీపీ, షుగర్, హెచ్ఐవీ తదితర పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీపై రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు ఎంపీ బీబీపాటిల్ రాక

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈ నెల 24న మండల పరిధిలోని మామిడ్గి గ్రామ శివారులో గల ఎస్ఎస్‌వీకి జహీరాబాద్ ఎంపీ, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్ వస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకార్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఎస్ఎస్‌వీ పంక్షన్ హాల్లో నిర్వహించే మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

◆ ముగిసిన ఎల్లమ్మతల్లి వార్షికోత్సవం

మునిపల్లి(అందోల్): ఎల్లమ్మతల్లి 7వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారు ఎల్లమ్మ దేవాలయంలో శనివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

◆ సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న చంద్రారెడ్డి తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం సీఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, గోపాలమ్మలతో పాటు కాంగ్రెస్ నాయకులు సీఐ గంగాధర్‌ను సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని సీఐ నాయకులకు సూచించారు.

◆ ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి గ్రామంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్ కొనసాగుతుంది. గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని గ్రామ క్రైస్తవులు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నరప్‌కు రూ.5వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేస్తున్నట్లు నిర్వాహకులు ఎ.శ్రీనివాస్, ఏడం, లాజర్, ధన్‌రాజ్, ప్రశాంత్, సుధాకర్, దయానంద్, దినేష్, విజయ్ తెలిపారు.

◆ కారుణ్య నియామకాలపై హర్షం

పుల్‌కల్(అందోల్): సింగరేణి యాజమాన్యం కారుణ్య నియామకాలపై ఉత్తర్వులు ఇవ్వడంపై సింగూరు జెన్‌కో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం విద్యుత్ కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. జెన్‌కోలో చాలా కాలం తర్వాత కారుణ్య నియామకాలు చేపట్టడం అభినందనీయమని సంఘం నాయకులు చంద్రయ్య, దుర్గారావు, పాండయ్య పేర్కొన్నారు.

◆ సామాజిక సేవలోనే ఆనందం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ఉన్న ఆనందం మరెందులోనూ ఉండదని బీఆర్ఎస్ నాయకులు బాలగౌని సాయిచరణ్ గౌడ్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తాండలో ఒక దివ్యాంగుడికి తన సొంత ఖర్చుతో కృతిమ కాలును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

◆ నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ

పటాన్‌చెరు టౌన్: నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ, అధ్యాపకులకు నిరంతర శిక్షణ అవసరమని పలువురు వక్తలు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో 'శిక్షకులకు శిక్షణ' పేరిట శనివారం ఒక రోజు అధ్యాపక వికాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎక్స్ సెల్లా వ్యవస్థాపకుడు బెదద్యుతి చక్రవర్తి ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ప్రాజెక్టు–ఆధారిత అభ్యాసం, పరిశోధన– సమగ్ర బోధన, విద్యార్థి– కేంద్రీకృత అభ్యాసాలపై ఆయన అవగాహన కల్పించారు. పలు ఫార్మసీ కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ కోవాలెంట్ పరిశ్రమపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్: హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామ శివారులోని కోవాలెంట్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతికి శనివారం ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివ శంకరరావు తెలిపారు. పరిశ్రమలో ఈ నెల 5న రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు మృతి చెందినప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కలెక్టర్‌కు విన్నవించారు. కార్మికుల ప్రాణాలు బలిగొంటున్న కోవలెంట్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు యజమాన్యం పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

◆ బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా రుషబ్



రుషబ్‌తో నాయకులు

జహీరాబాద్ టౌన్: బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా రుషబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం కన్వీనర్ నరేశ్ పాటిల్ మాట్లాడుతూ లోకసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సామఅనిల్, అరుణ కొలాస్, పాలింకార్ సంతోష్, అర్చన సరడా, అప్పం శ్రవణ్, నీలేశ్ తదితరులు పాల్గొన్నారు.